
# జీఎస్‌డీపీలో తెలంగాణ టాప్

**నిరుడు రాష్ట్రంలో 9.2% వృద్ధిరేటు • జాతీయ సగటు కంటే 1% అధికం • తర్వాతి స్థానాల్లో తమిళనాడు, రాజస్థాన్**




హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ దూసుకెళ్తున్నది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) రాష్ట్ర సంపద (జీఎస్‌డీపీ) 9.2% వృద్ధి చెందింది. ఇది 8.2 శాతంగా ఉన్న జాతీయ సగటు వృద్ధిరేటు కంటే 1% అధికం. తద్వారా దేశంలో అత్యధిక ఆర్థిక వృద్ధిరేటు సాధించిన 10 పెద్ద రాష్ట్రాల జాబితాలో తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రూ.7.9 లక్షల కోట్ల వాస్తవిక జీఎస్‌డీపీతో దేశంలో తొమ్మిదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. రూ.15.7 లక్షల కోట్ల జీఎస్‌డీపీతో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న తమిళనాడు నిరుడు 8.2 శాతం వృద్ధిరేటును సాధించగా.. ఏడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న రాజస్థాన్ 8 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. ఈ మూడు రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి సేవల రంగమే ప్రధాన కారణం. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో 63% వాటాను కలిగివున్న సేవల రంగం నిరుడు 11% వృద్ధిరేటును సాధించింది. రూ.24.1 లక్షల కోట్ల జీఎస్‌డీపీతో దేశంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న మహారాష్ట్రతోపాటు తమిళనాడులో నిరుడు సేవల రంగం వృద్ధిరేటు 9 శాతానికే పరిమితమైంది.

**వ్యవసాయ రంగంలో మాంద్యం**

ఎల్‌నినో ప్రభావం వల్ల నిరుడు చాలా రాష్ట్రాల్లో వ్యవసాయ రంగం వృద్ధిరేటు తగ్గినట్టు 'ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్' సీనియర్ ఆర్థిక విశ్లేషకుడు పారస్ జస్రాయ్ తెలిపారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి సేవల రంగంతోపాటు రియల్ ఎస్టేట్ రంగాలు.. తమిళనాడు ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ, నిర్మాణం, రియల్ ఎస్టేట్ రంగాలు దోహదపడినట్టు పేర్కొన్నారు. 2020-23 వరకు మాంద్యాన్ని ఎదుర్కొన్న తయారీరంగం కూడా 2024లో పుంజుకున్నట్టు చెప్పారు.

# ముంచెత్తిన వాన

- **జోగుళాంబ గద్వాల, నిజామాబాద్ జిల్లాలో వర్షం**
- **పొంగిన వాగులు, వంకలు.. రాకపోకలు బంద్**



నిజామాబాద్ నుంచి ఖానాపూర్ వెళ్లే మార్గంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు.. వాహనదారుల తిప్పలు

అయిజ/వడ్డేపల్లి/ఖిలీల్‌వాడి/కంఠేశ్వర్, సెప్టెంబర్ 4 : జోగుళాంబ గద్వాల, నిజామాబాద్ జిల్లాల్లో మంగళవారం అర్ధరాత్రి వాన దంచికొట్టింది. భారీ వర్షంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అయిజ, వడ్డేపల్లిలో, నిజామాబాద్ శివారులోని మాలపల్లి, ఆటోనగర్‌లో ఇండ్లలోకి నీళ్లు చేరాయి. అయిజ-ఎమ్మిగనూరు అంతర్రాష్ట్ర రహదారి డైవర్షన్ కొట్టుకుపోయింది. ఖానాపూర్, మానిక్ బండార్, రేడియోస్టేషన్ ప్రాంతాల్లోకి వరద పోటెత్తింది. ఖానాపూర్‌కు వెళ్లే రోడ్డుపైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మానిక్‌భండార్ వద్ద నిజామాబాద్-ఆర్మూర్ ప్రధాన రహదారిపై భారీగా వరద చేరడంతో అధికారులు వాహనాలను మళ్లించారు. గడిచిన 24 గంటల్లో నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా 6.11 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా డొంకేశ్వర్‌లో 16.23 వర్షపాతం నమోదైంది.

**ఇంటి గోడ కూలి వృద్ధురాలు మృతి**

ములుగు రూరల్ : ములుగు జిల్లా ములుగు మండలం భూపాలనగర్(పందికుంట) గ్రామంలో ఇంటి గోడ కూలి వృద్ధురాలు మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామానికి చెందిన సున్నం ఆగమ్మ (75)ఇంటి గోడలు నానిపోయాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఇంటి గోడ కూలి మీద పడడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఆగమ్మ ఒంటరిగానే ఇంట్లో ఉంటున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

## శ్రీశైలం కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో స్పార్క్

శ్రీశైలం, సెప్టెంబర్ 4 : శ్రీశైలం డ్యాం జెన్‌కో కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో శబ్దం వచ్చింది. దీనిపై చీఫ్ ఇంజినీర్ కాంతారావు స్పందిస్తూ మంగళవారం రాత్రి 10:30 గంటల సమయంలో 7వ నెంబర్ జనరేటర్‌లో సాంకేతిక సమస్య తలెత్తి స్పార్క్ ఏర్పడినట్టు తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించామని, ప్రస్తుతం ఆ జనరేటర్ తోపాటు మిగతా ఆరు జనరేటర్ల ద్వారా విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నట్టు చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మొద్దని సీఈ సూచించారు.



నేలకూలిన చెట్లను వీడియో తీస్తున్న పీసీసీఎఫ్ డోబ్రియాల్

# సుడిగాలి బీభత్సం

ములుగు, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా సమ్మక్క-సారక్క తాడ్వాయి మండలంలోని మేడారం అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు తోడు గాలి దుమారానికి 16 విద్యుత్ స్తంభాలు సైతం విరిగిపడ్డాయి. ఏటూరునాగారం అభయారణ్యంలో తాడ్వాయి నుంచి మేడారం వెళ్లే రహదారికి ఇరువైపులా 200 హెక్టార్లలో అటవీ ప్రాంతం పూర్తిగా ధ్వంసమైంది. దీనిపై మంత్రి సీతక్క బుధవారం 500 ఎకరాల్లో చెట్లు నేలకొరగడంపై పీసీసీఎఫ్, డీఎఫ్‌వోలతో సమీక్షించారు. లక్ష చెట్ల వరకు నేలకూలడంపై డ్రోన్ కెమెరాల సహాయంతో నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశించారు. తాడ్వాయి-మేడారం మధ్య అడవిలో జరిగిన విధ్వంసం రాష్ట్రంలోనే మొదటిదని పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ పేర్కొన్నారు. ధ్వంసమైన అటవీ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు.

# ఊహకందని విపత్తు

- **మేడారం అటవీ ప్రాంతంలో చెట్లు కూలడంపై మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ ఆవేదన**



హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాలతో మేడారం అటవీప్రాంతంలో వేల సంఖ్యలో చెట్లు కూలిన ఘటనపై బీఆర్ఎస్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ విచారం వ్యక్తం చేశారు. 'భారీ వర్షాల కారణంగా మేడారం అటవీప్రాంతంలో లక్ష చెట్లు కూలిపోవడం ఊహకు సైతం అందని విషాదం. ఇది తీవ్రంగా బాధిస్తున్నది. పర్యావరణానికి జరిగిన పెను నష్టాన్ని తక్షణమే పునరుద్ధరించాల్సిన అవసరాన్ని ఈ ఘటన గుర్తు చేస్తున్నది. సుస్థిరమైన భవిష్యత్తు కోసం మొక్కలు నాటి, అటవీ ప్రాంతాన్ని పునరుద్ధరించేందుకు ఏకమవుదాం' అని ఆయన 'ఎక్స్'లో పిలుపునిచ్చారు.

## వరదలో చిక్కుకున్న పశువుల కాపరులు

**ఒకరు గల్లంతు, ఆరుగురు సురక్షితం • కిన్నెరసాని-ముర్రేడు వాగుల మధ్య ఘటన**

పాల్వంచ రూరల్/సారపాక, సెప్టెంబర్ 4 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని దంతెలబోర గ్రామం వద్ద కిన్నెరసాని, ముర్రేడు వాగులు కలిసే చోట ఏడుగురు పశువుల కాపరులు బుధవారం వరద నీటిలో చిక్కుకున్నారు. సమాచారం తెలుసుకున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పాల్వంచ, బూర్గంపాడు మండలాల రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి రక్షణ చర్యలు చేపట్టారు. పశువులకాపరుల్లో ఉప్పుసాకకు చెందిన జారే సాయికృష్ణ గల్లంతు కాగా, మిగతా వారు క్షేమంగా ఒడ్డుకు చేరారు. దంతెలబోర, గంగదేవిగుప్ప, ఉప్పుసాక ప్రాంతాలకు చెందిన దాదాపు 90మేకలు, పశువులు మేత కోసం దంతెలబోర నుంచి వాగులోకి వెళ్లాయి. ఆ సమయంలో కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి 53 వేల క్యూసెక్కుల నీరు వెళ్తున్నది. పశువులను తోలుకుని వచ్చేందుకు పశువుల కాపరులు వెళ్లిన సమయంలోనే ముర్రేడు వాగు ఉధృతి పెరిగి వారిని చుట్టుముట్టింది. సమాచారం తెలుసుకున్న దంతెలబోరవాసులు విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. పశువుల కాపరుల్లో దంతెలబోరకు చెందిన తటుకుల కేదారి, దేశబోయిన ఈశ్వరయ్య, మంచినీళ్ళ ముసలయ్య, గంగదేవిగుప్పకు చెందిన కుంజా భద్రయ్య, ఇర్పా నగేశ్, మసం కళ్యాణ్, ఉప్పుసాకకు చెదిన జారే సాయి కృష్ణ ఉన్నారు. కలెక్టర్‌తోపాటు రెవెన్యూ, పోలీస్ అధికారులు సంగం వైపు, బూర్గంపాడు అధికారులు సోంపేట వద్ద బోట్లు, పడవలు, తాళ్ళతో రక్షణ చర్యలు ప్రారంభించారు. కిన్నెరసాని గేట్లను మూయించి నీటి విడుదలను ఆపేశారు. ముగ్గురు కాపరులు ఈత కొట్టుకుంటూ సంగం వైపు వస్తుండగా.. సాయికృష్ణ గల్లంతయ్యాడు. మరో నలుగురు తాళ్లసాయంతో బూర్గంపాడు మండలం సోంపేటకు చేరుకున్నారు. గల్లంతైన సాయి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## ఖమ్మం జిల్లాలో 7,500 ఇండ్ల మునక

**బాధితులందరికీ అండగా ఉంటాం : తుమ్మల**

ఖమ్మం, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కూసుమంచి : మున్నేరు వరదల కారణంగా ఖమ్మం నగరంలో సుమారు 5 వేల ఇండ్లు, ఇతర ప్రాంతాల్లో మరో 2,500 కలిపి మొత్తం 7,500 ఇండ్లు ముంపునకు గురయ్యాయని ప్రాథమికంగా అంచనా వేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి నివేదికలు వస్తాయని తెలిపారు. వరద బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఖమ్మంలోని కేఎంసీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గురువారం నుంచి బాధితుల ఖాతాల్లో నగదు జమచేస్తామన్నారు. బురద తొలగింపు కోసం 100 ట్రాక్టర్లు, 50 జేసీబీలు, 70 ట్యాంకర్లు పనిచేస్తున్నాయని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్ దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ పాల్గొన్నారు.

**గుండెను పిండేసే బాధ ఇది : పొంగులేటి**

'నాయకన్‌గూడెంలో తమను రక్షించాలని నాకు కూడా ఫోన్ చేశారు. చాలా ప్రయత్నం చేశాం.. చివరకు వరదలో కొట్టుకుపోయారనే సమాచారం చాలా బాధ కలిగించింది.. గుండెను పిండేసింది' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నాయకన్‌గూడేనికి చెందిన యాకూబ్, సైదాబీ దంపతులు వరదల్లో చనిపోగా వారి కుటుంబసభ్యులకు కూసుమంచిలో ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ వారిని బతికించాలని చాలా ప్రయత్నాలు చేశామని తెలిపారు. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, వ్యవసాయ, పంచాయతీరాజ్‌శాఖ సహకారంతో ఒకరి ప్రాణాన్ని కాపాడుకోగలిగామని చెప్పారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీవో గణేశ్, ఏసీపీ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 3: రాష్ట్రంలో ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. తుంగభద్ర డ్యాం వద్ద 10 గేట్లు, జూరాల డ్యాం వద్ద 15 గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేశారు. శ్రీశైలం డ్యాంకు వరద తగ్గుముఖం పట్టింది. ఉదయం 6 గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగగా.. మధ్యాహ్నం తర్వాత గేట్లను మూసివేశారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది. రెంజల్ మండలంలోని కందకుర్తి వద్ద వంతెనను తాకుతూ గోదావరి ఉధృతంగా ప్రవహించింది. దీంతో 41 గేట్లు ఎత్తి 3.50 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు.

# రగులుతున్న జైనూర్

› మొదటిపేజీ తరువాయి...

తగులబెట్టారు. తాళాలను పగులగొట్టి మరీ నిప్పు పెట్టడంతో దాదాపు 50కిపైగా షాపులు కాలి బూడిదయ్యాయి. రోడ్లపై కనిపించిన ద్విచక్రవాహనాలు, ఓ బొలెరో కారును కూడా దగ్ధం చేశారు. దీంతో ప్రత్యర్థి వర్గానికి చెందిన వారు ఆయుధాలు, కట్టెలు, రాడ్లు తీసుకొని రోడ్లపైకి వచ్చారు. దీంతో మండల కేంద్రంలో కొద్దిసేపు భయానక వాతావరణం నెలకొన్నది. ఈ హింసను తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తుండగా.. ఆందోళనకారులు వాటిని లాక్కొని పగులగొట్టారు. ఈ క్రమంలో ఓ ఎస్సై ఫోన్ కూడా ధ్వంసమైంది. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక పోలీసు బలగాలను రప్పించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొటి జైనూర్ మండలంలో 144 సెక్షన్ విధించారు. మండల కేంద్రంలో దాదాపు ఇంటికో పోలీసును మోహరించారు. పరిస్థితిని సమీక్షేందుకు మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్, రామగుండం సీపీ శ్రీనివాస్, ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం, ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, మంచిర్యాల డీసీపీ భాస్కర్ బుధవారం జైనూర్‌కు వచ్చినట్టు సమాచారం.

**బంద్‌కు పిలుపు.. ఆపై విధ్వంసం**

జైనూర్ మండలంలోని దేవుగూడకు చెందిన ఆదివాసీ మహిళపై జరిగిన లైంగిక దాడి యత్నం, హత్యాయత్నం ఘటనలో ప్రభుత్వ, పోలీసుల తీరును నిరసిస్తూ తుడుం దెబ్బ సహా ఆదివాసీ సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఆదివాసులు ఇతర వర్గాల ఆస్తులపై దాడులు ప్రారంభించగా, ప్రతిదాడులతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. పరస్పర రాళ్ల దాడులతో ఆస్తుల నష్టం సంభవించింది. బంద్‌లో పాల్గొనేందుకు లింగాపూర్, సిర్పూర్, జైనూర్, ఉట్నూర్ మండలాల్లోని వివిధ గ్రామాలు, గూడేల నుంచి ఆదివాసులు, ఎక్కువ శాతం మంది మహిళలు జైనూర్ మండల కేంద్రానికి తరలివచ్చారు. విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య సోనూపటేల్‌గూడలో 200 మంది ఆదివాసులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎలాంటి హింసాత్మక ఘటనలకు పాల్పడవద్దని నిందితుడైన ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేశామని, చట్ట ప్రకారం శిక్షలు పడేలా చూసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఆదివాసీలు డీఎస్పీతోనూ వాగ్వాదానికి దిగారు. 1/70 చట్టానికి వ్యతిరేకంగా ఇక్కడ స్థిరపడిన కొందరు ఆదివాసీ మహిళలపై దాడులు చేస్తున్నారంటూ మండిపడ్డారు. అలాంటి వారందరినీ ఇక్కడి నుంచి పంపించేయాలని డిమాండ్ చేశారు. ఇది జరిగిన కాసేపటికే జైనూర్ మండల కేంద్రంలో వ్యాపార సముదాయాలకు నిప్పు పెట్టారు. రోడ్లపై నిలిపి ఉన్న వాహనాలను ధ్వంసం చేసి దగ్ధం చేశారు. పోలీసులు వారిని చెదరగొట్టడంతో ఆదివాసులు చుట్టు పక్కల ఉన్న గోండు గూడేల్లోకి వెళ్లిపోయారు. ఇంతలో పోలీసులు వచ్చారని తెలుసుకున్న ఆటోడ్రైవర్ వర్గం వారు ఆయుధాలతో రోడ్లపైకి వచ్చారు. ఎవరు కనిపించినా దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారింది. ఎప్పుడేం జరుగుతుందోనని స్థానికులు భయంతో వణికిపోయారు. బుధవారం రాత్రి వరకు ఇదే వాతావరణం నెలకొంది. వార్తా సేకరణకు జైనూర్ వెళ్లిన మీడియా సిబ్బందిని పోలీసులు అక్కడి నుంచి పంపించి వేశారు. ఇతరులెవరినీ జైనూర్‌లోకి రానివ్వడం లేదు. దాడుల నేపథ్యంలో విద్యుత్తు తీగలు కాలిపోయి తెగిపోవడంతో మధ్యాహ్నం రెండు గంటల నుంచి జైనూర్‌కు విద్యుత్తు సరఫరా నిలిచింది. వదంతులు, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఉద్రిక్త ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటుచేశారు. పోలీసులు బలగాలు ఆయా ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నాయి. ప్రార్థన స్థలాల వద్ద హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.

**మరో మహిళపై లైంగికదాడి?**

ఆదివాసీ నిరసనకారుల దాడులకు ప్రతీకారంగా రాత్రివేళ మరో ఆదివాసీ మహిళపై లైంగికదాడి జరిగినట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ మేరకు ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. దీనిపై జైనూర్ ఎస్సై డీ సాగర్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా అలాంటిదేమీ జరగలేదని చెప్పారు. జైనూర్ విధ్వంసంపై పోలీసులు ఎలాంటి సమాచారాన్ని వెల్లడించడం లేదు. కావాలనే రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజులుగా ఈ విషయాన్ని దాచేందుకే ప్రయత్నిస్తున్నదని కొన్ని ఆదివాసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాగా.. సున్నితమైన విషయం కావడంతో ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఏవీ బయటికి చెప్పడం లేదని పోలీసువర్గాలు చెప్తున్నాయి.



జైనూర్ మండల కేంద్రంలో దగ్ధమవుతున్న వ్యాపార సముదాయాలు

## పలుచోట్ల ఆదివాసీల ఆందోళన

గాదిగూడ మండలం లోకారి(కే)లోని కుమ్రంభీం చౌరస్తా వద్ద జరిగిన నిరసనలో తుడుందెబ్బ గాదిగూడ మండల అధ్యక్షుడు మడావి చంద్రహరి మాట్లాడుతూ.. ఆదివాసులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసిన నిందితుడికి నడిరోడ్డుపై ఉరిశిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు పెద్ద ఎత్తున చేపడుతామని హెచ్చరించారు. ఇంకా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి.. ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాల్లో కూడా ఆందోళన కార్యక్రమాలు కొనసాగాయి.

**సంయమనం పాటించాలి: ఎస్పీ**

బాధిత ఆదివాసీ మహిళకు హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో వైద్యం కొనసాగుతుండగా, ప్రభుత్వ ఖర్చులు భరిస్తున్నదని జిల్లా ఎస్సీ డీవీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో వెల్లడించారు. వెల్లడించారు. బాధితురాలికి ఇప్పటికే లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించినట్టు తెలిపారు. ఆమెపై దాడి చేసిన నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ఆదివాసీలతోపాటు ఇతర వర్గాలు ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జైనూర్‌లో 144 సెక్షన్ విధించామని, ప్రజలు గుంపులుగా చేరడం, ధర్నాలు, రాస్తారోకోలు చేయడం నిషిద్ధమని, ఎవరైనా ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



జైనూర్ మండల కేంద్రంలో తిరుగుతున్న పోలీసు యంత్రాంగం

- **నాలుగు గంటలు.. నరకయాతన**



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో కరెంట్ లేక రోగులు తీవ్రఅవస్థలు పడ్డారు. బుధవారం మధ్యాహ్నం నాలుగు గంటలపాటు నవజాత శిశువులు, రోగులు నరకయాతన అనుభవించారు. చీకట్లో బిక్కుబిక్కుమంటూ గడిపారు. టవల్ ఊపుతూ రోగులు, శిశువులకు కుటుంబసభ్యులు ఉపశమనం కలిగించారు. చీకట్లోనే వైద్యులు చికిత్స అందించాల్సిన దుస్థితి వచ్చింది. ఈ విషయంపై సూపరింటెండెంట్ హరీశ్చంద్రారెడ్డిని వివరణ కోరగా దవాఖాన పాత భవనం కావడంతో లేబర్ రూంలో కేబుల్ సమస్య వచ్చినట్టు తెలిపారు. - మంచిర్యాల అర్బన్

# రాష్ట్రంలో పోలీసులు ఏం చేస్తున్నట్టు?

తెలంగాణలో మతపరంగా హైదరాబాద్ తరువాత అత్యంత సున్నితమైన ప్రదేశమది. రాఖీ పౌర్ణమినాడు ఓ ఆదివాసీ మహిళపై మరో వర్గానికి చెందిన ఆటోడ్రైవర్ లైంగికదాడికి ప్రయత్నించి, ఆపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. నాడు స్పృహ కోల్పోయిన బాధిత మహిళ మూడు రోజుల క్రితమే స్పృహలోకి వచ్చి తనకు జరిగిన ఘటనను వివరించింది. దీంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. అయినా స్థానిక పోలీసులు నిర్లిప్తంగానే ఉన్నారు. తమ జాతి మహిళపై జరిగిన ఘటనకు వ్యతిరేకంగా ఆదివాసీలు పెద్ద ఎత్తున నిర్వహించిన ఆందోళనను 'నమస్తే తెలంగాణ' ప్రముఖంగా ప్రచురిస్తూ.. పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నట్టు హెచ్చరించింది. అయినప్పటికీ పోలీసులు ఎటువంటి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టలేదు. దీంతో ఒక్కసారిగా చిచ్చురేగింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో బుధవారం పెద్ద ఎత్తున హింస ప్రజ్వరిల్లింది. ఐదు గృహాలు అగ్నికి ఆహుతయ్యాయి. మండల కేంద్రంలో 50కిపైగా దుకాణాలు కాలి బూడిదయ్యాయి. ఓ స్కార్పియో సహా అనేక వాహనాలు దగ్ధమయ్యాయి. ప్రత్యర్థి వర్గానికి చెందినవారు ఆయుధాలు, కట్టెలు, రాళ్లు తీసుకొని రోడ్లపైకి వచ్చారు. పరస్పరం రాళ్ల దాడులు, ఇండ్లు, షాపుల దగ్ధంతో జైనూర్ మండల కేంద్రం రణరంగాన్ని తలపించింది. ఇటీవలి కాలంలో మతకల్లోలాలకు దారితీసే ఘటనలు వరుసగా నాలుగు జరిగాయి. అయినప్పటికీ హింసను అరికట్టడంలో నిఘావర్గాల వైఫల్యం, పోలీసుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హైదరాబాద్, సెప్టెంబర్4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గడచిన నెలరోజులుగా చోటుచేసుకుంటున్న వరుస సంఘటనలు పట్టుతప్పుతున్న శాంతిభద్రతలకు దర్పణం పడుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా, పోలీసు ఉన్నతాధికారుల వైఫల్యాలను బట్టబయలు చేస్తున్నాయి. గత పదేండ్లలో ఎన్నడూలేనివిధంగా వర్గవైషమ్యాలు చెలరేగిపోవటం ఆందోళన కలిగిస్తున్నది.

**ఘటనలను తొక్కిపెడుతున్న వైనం..**

తాజాగా జైనూర్‌లో చోటుచేసుకున్న సంఘటన రాష్ట్రంలో నెలకొంటున్న అశాంతి వాతావరణానికి అద్దం పడుతున్నది. పోలీసులు, నిఘా వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తున్నది. ఓ ఆదివాసీ మహిళపై వేరొక వర్గానికి చెందిన ఆటోడ్రైవర్ లైంగికదాడి, హత్యాయత్నానికి పాల్పడిన ఘటన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇదొక్కటే కాదు గత నెల మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్‌లోనూ ఇరువర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. అది మరువక ముందే ఓల్డ్ సిటీలో, ఆపై గోషామహల్ పరిధిలో రెండు వర్గాల ప్రజలు పరస్పరం దాడులకు తెగబడ్డారు. జైనూర్ తరహాలనే ఈ ఘటనలేవీ బయటకు రాకుండా పోలీసులు తొక్కిపెడుతున్నారు. తమ వైఫల్యాలాన్ని కప్పిపుచ్చుకుంటున్నారు.

**సీఎం, పోలీసుల వైఫల్యం..**

ప్రస్తుతం వెలుగుచూస్తున్న వరుస సంఘటనలు రాష్ట్రంలోని నిఘా వ్యవస్థ మొత్తం నిర్వీర్యమైపోయిందనే సంకేతాన్ని ఇస్తున్నది. ఇది ప్రధానంగా హోంశాఖను తన వద్దనే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ పరిపాలన వైఫల్యమేనని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. హోంశాఖపై సీఎం ఎన్నడూ పూర్తిస్థాయిలో సమీక్ష చేయలేదు. డీజీపీ సైతం శాంతిభద్రతల పరిస్థితులు, తాజాగా వెలుగుచూస్తున్న ఘటనలపై ఆరా తీసిన ఆనవాళ్లు కనిపించలేదు. నిఘా వ్యవస్థపై సమీక్ష అంతంతమాత్రమేనని సమాచారం. దీంతో దిగువ స్థాయి పోలీసు ఉన్నతాధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలను గాలికి వదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి. సీనియర్ పోలీస్ ఆఫీసర్ల లోటు శాంతిభద్రతలు దిగజారిపోవడానికి కారణమని పోలీసు వర్గాలే బాహాటంగానే చర్చించుకుంటున్నాయి. సర్కారు స్పందించకపోతే తీవ్ర పరిణామాలు చోటుచేసుకునే అవకాశముంటుందని తెలంగాణ మేధావులు హెచ్చరిస్తున్నారు.